క్లుప్తంగా

కావమ్మా కరుణించమ్మా



ఆలయంలో భక్తులతో మంత్రి రోజా

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీకావమ్మా ఆలయ ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. కావమ్మ,మారయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కావమ్మా కరుణించమ్మా అంటూ ప్రార్థించారు. ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, ఆలయ నిర్వాహకులు మనోహర్‌రెడ్డి, రమేష్ బాబు, కౌన్సిలర్ రాధ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే పాటించాలి



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: దోమల వ్యాప్తి నివారణకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని తూగుండ్రం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలను అరికట్టాలంటే దోమల వ్యాప్తిని నివారించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటిని నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. పరిశుభ్రమైన నీటిని కాచి వడగట్టి తాగాలన్నారు. భోజనానికి ముందు చేతుల్ని శుభ్రం చేసుకోవాలని తెలిపారు.

మేలైన పశు పోషణతో అధిక పాడి దిగుబడి

గంగాధరనెల్లూరు: మేలైన పశువుల్ని పోషించి అధిక పాడి దిగుబడి పొందాలని ఎట్టేరి పశువైద్యాధికారి నాగాంజనేయులు సూచించారు. మండలంలోని గారంపల్లెలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 34 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేశారు. 30 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. 110 పశువులకు పిడుదుల మందును పిచికారీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు విజయశేఖర్, సిబ్బంది అనిత, గణేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీఓ సుజన

పాలసముద్రం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రీ సర్వే చేస్తున్నట్లు ఆర్డీఓ సుజన తెలిపారు. శుక్రవారం మండలంలో బాలకృష్ణాపురంలో జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్షణ పథకం రీ సర్వేను ఆమె పరిశీలించారు. పారదర్శకంగా సర్వే చేయాలని సర్వేయర్లు, వీఆర్వోలకు సూచించారు. రైతులు భూ రికార్డులను అధికారులకు అందజేసి శాశ్వత సరిహద్దులు ఏర్పరుచుకోవాలని తెలిపారు. అనంతరం బాలకృష్ణాపురం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ బాబు, మండల సర్వేయర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నింద్ర: మండలంలోని అత్తూరు దళితవాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు శ్రీనివాసులు(75) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృత దేహాన్ని సందర్శించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే విధంగా ఇటీవల మృతి చెందిన సౌందర్‌రాజు, ప్రకాష్ ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, నాయకులు దామురెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



కార్వేటినగరం: ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాల నిర్వహణకు 1986–87 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.25వేలు వితరణగా అందించారు. ఈమొత్తాన్ని ఫిక్సిడ్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీ మొత్తంతో హిందీ భాషా దినోత్సవాలను నిర్వహిస్తామని హెచ్‌ఎం వైవీ వసుమతీదేవీ తెలిపారు. అలాగే పంకజరాణి తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం రూ.20 వేలు విలువజేసే ప్రింటర్‌ను అందించారు. పూర్వ విద్యార్థులు ప్రసాద్, పద్మజ, రాజశేఖర్, హరిభాస్కర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే రథ సారథులు

- సైనికుల్లా పనిచేసి పార్టీ పటిష్టతను పెంచాలి
- పథకాల లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో మంత్రి ఆర్కేరోజా



హాజరైన గృహ సారథులు, వలంటీర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: 'వైఎస్సార్ సీపీకి గృహ సారథులే రథసారథులు.. ఇప్పటి నుంచే పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలి.. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధిక మెజారిటీతో గెలిపించే బాధ్యతను క్రమశిక్షణతో చేపట్టాలి' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా పిలుపునిచ్చారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో విజయపురం మండల గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధి, వైఎస్సార్ సీపీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరిచాలని తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించారన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత గృహ సారథులు, కన్వీనర్లపైనే ఉందన్నారు. సచివాలయ పరిధిలో తమకు కేటాయించిన 50 గృహాలను తరచూ సందర్శిస్తూ ప్రజల సందేహాలను తీర్చాలని తెలిపారు. ఎవరైనా అసంతృప్తిగా ఉంటే కారణాలు తెలుసుకుని నివృత్తి చేయాలన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనంత పటిష్టమైన వ్యవస్థ మనకుందని, సమష్టిగా పని చేస్తే మళ్లీ సునాయాసంగా అధికారంలోకి రావడం తథ్యమన్నారు. పాలనాపరమైన సంస్కరణతో ప్రజలకు సంతృప్తికర స్థాయిలో మేలు జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల్లా ప్రజలవద్ద అబద్ధాలు చెప్పడం లేదని, చేసిన మేలు మాత్రమే ఉన్నదున్నట్లుగా చెబుతున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిపాలన, సంక్షేమం గడప వద్దకే అందించడం ముఖ్యమంత్రి జగనన్నకు మాత్రమే సాధ్యమైందన్నారు. నియోజకవర్గంలో గత పాలకులు దోపిడీ పూరిత వ్యవహారంతో ప్రజలను వేధించారని, ప్రస్తుతం ప్రశాంతమైన వాతావరణంలో విలువలతో కూడిన పరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీలు మంజు బాలాజీ, దశరథరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపీనాథ్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ రాజగోపాల్, నాయకులు రాజాదాసు, శివరాజు, భాస్కర్, శేఖర్‌రాజు, చెంచు ప్రసాద్‌రాజు, కుమార్, మురళి, రత్నం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి



ఎస్‌బీఆర్‌పురంలో సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

వడమాలపేట: సంక్షేమ పథకాలతో పేద ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎస్‌బీఆర్‌పురం సచివాలయ పరిధిలోని ఎస్‌బీఆర్‌పురం, దళితవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల కాలంలో అందించిన పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. కుల, మతాలకతీతంగా అర్హులందరికీ నవరత్నాలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంబేడ్కర్‌కాలనీలో తాగునీటి బోరును మంత్రి ప్రారంభించారు. ఎంపీడీఓ అరుణ, ఎంపీపీ విజయలక్ష్మి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైస్ ఎంపీపీలు ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, నాయకులు వెంట్రామరాజు, సుదర్శన్‌రాజు, బాబు, తిమ్మయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌కుమార్, రమేష్‌రాజు, ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



కావూరివారిపల్లెలో పథకాల లబ్ధి వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- పథకాల లబ్ధితో ఆనందంగా ఉంటున్నామన్న లబ్ధిదారులు
- ఓటుతో రుణం తీర్చుకుంటామని స్పష్టం

పెనుమూరు(కార్వేటినగరం): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం పెనుమూరు మండలంలోని చార్వాకానిపల్లె సచివాలయ పరిధిలోని కావూరివారిపల్లె, సన్యాసనపల్లెలో గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కావూరి వారిపల్లెలో లబ్ధిదారు సంపూర్ణమ్మ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇన్ని సంక్షేమ పథకాలు లేవని, గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు పసుపు,కుంకుమ కింద పది వేలు ఇచ్చి వడ్డీతో సహా కట్టించుకున్నారని, జగనన్న పథకాల లబ్ధితో సంతోషంగా ఉన్నామని తెలిపారు. ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్క మహిళ జగనన్నే సీఎంగా ఉండాలని ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. కావూరివారి పల్లె గ్రామస్తుల వినతి మేరకు నూతన బోరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

గుమ్మం వద్దకే పథకాల లబ్ధి

కావూరివారిపల్లెలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన రామచంద్రమ్మతో నారాయణ స్వామి మాట్లాడుతూ పథకాలు అందుతున్నాయా? ప్రభుత్వం అందిస్తున్న బియ్యం బాగుందా..? అని అడిగారు. ఆమె సమాధానం ఇస్తూ పథకాలు మా ఇంటి గుమ్మం వద్దకే చేరుతున్నాయని, బియ్యం గతంలో కంటే నాణ్యతగా ఉందని, మా కుటుంబానికి ఎన్నడూ లేని విధంగా రూ.3లక్ష 54 వేల 730 లబ్ధి చేకూరిందని తెలిపారు. జీవితాంతం మా ఓటు జగనన్నకేనని చెప్పడంతో ఉపముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఏరుగానిపల్లె దళితవాడకు సరైన దారి సౌకర్యంలేదని డిప్యూటీ సీఎం గుర్తించారు. ఈ గ్రామానికి దారి సౌకర్యం కల్పించాకే తాను అడుగు పెడతానని చెప్పడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నారాయణస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కల్యాణమస్తు పథకానికి వధువు, వరుడికి పదో తరగతి విద్యార్హత తప్పని సరిగా ఉండాలని తెలిపారు. సర్పంచ్ నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యదర్శి దూదిమోహన్, విజయకుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, జయచంద్రారెడ్డి, మురళి, దాము తదితరులు పాల్గొన్నారు.

ఉగాది లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



ఆవలకండ్రిగలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఉగాది లోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని ఆవలకండ్రిగ, రామానాయుడుపల్లె జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న పనులను శుక్రవారం ఎంపీపీ అనితారెడ్డితో కలసి పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కాలనీలో లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. లబ్ధిదారులు ఉగాది లోపు నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గీత, పాల్గొన్నారు.



పాలసముద్రం: మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: జగనన్న లేవుట్లలో గృహనిర్మాణ పనులు త్వరితిగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్. విద్యావతి తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్, సంఘమిత్రలు, లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ దాము, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేసేలా నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైన వారు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

నాణ్యతగా మధ్యాహ్న భోజనం



భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీపీ అనితారెడ్డి

గంగాధరనెల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా పెట్టాలని ఎంపీపీ అనితారెడ్డి తెలిపారు. మండలంలోని వింజం పంచాయతీ ఇందిరానగర్ కాలనీ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూశారు. ఎంపీపీ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. సర్పంచ్ రామక్క, ఎంపీడీఓ శ్రీదేవి, సీడీపీఓ వినతశ్రీ, ఏపీఎం చిరంజీవి, పాల్గొన్నారు.

6న చేపల చెరువుల వేలం

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని చేపల చెరువులకు ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు వేలం నిర్వహించనున్నట్లు డీడీఓ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా షబ్బీర్‌బాషా

కార్వేటినగరం: ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీరంగరాజపురం తహసీల్దార్ షబ్బీర్‌బాషా శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అమర్నాథ్ గంగవరానికి బదిలీ కావడంతో ఇన్‌చార్జిని నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సమగ్ర భూ రీసర్వే, శ్మశాన వాటికల ఏర్పాటును వేగవంతం చేస్తామన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

పాడి పశువుల పెంపకంతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గోపాల్

గంగాధరనెల్లూరు: కోళ్లు, పాడి పశువుల పెంపకం, మల్బరీసాగుతో వ్యవసాయంతో పాటు రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, దీనిపై మొగ్గు చూపాలని డీఆర్సీ వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. మండలంలోని అక్కన్నగారిపల్లెలో శుక్రవారం మహిళా రైతులకు వ్యవసాయేతర ఆదాయంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోళ్లు, పాడి పశువుల పెంపకం, మల్బరీసాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందన్నారు. ఆరుతడి పంటలను తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చని తెలిపారు. ఏఓ వందన, సిబ్బంది చక్రవర్తి,గీత పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి



కనికలమ్మ లేఔట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

గంగాధరనెల్లూరు: భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కొండేపల్లి, వీరకనెల్లూరు, నెల్లేపల్లెకు సంబంధించిన భూ రికార్డులను తహశీల్దారు కార్యాలయంలో ఆయన పరిశీలించి తహశీల్దారు ఇన్బనాథన్‌కు పలు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో రైతులతో సమన్వయం చేసుకుని సర్వేయర్లు రీ సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీకాలనీ వాసులకు శ్మశాన స్థలాల కేటాయింపునకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రెవెన్యూ అధికారులు దీనికి సంబంధించిన భూములను గుర్తించాలన్నారు. మండలంలో అసైన్డ్ భూముల పంపిణీకి 160 మంది లబ్ధిదారులకు 157 ఎకరాల భూములను గుర్తించినట్లు ఆర్డీఓ రేణుక కలెక్టర్‌కు వివరించారు. రామానాయుడుపల్లె, కనికలమ్మ జగనన్న లేఔట్‌ను పరిశీలించి ఇళ్ల నిర్మాణాల పురోగతిని పెంచాలని కలెక్టర్ సూచించారు. జేసీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీదేవి కూడా పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు



చెరకు పంటను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని చిత్తూరు పీఎస్‌ఎఫ్ డీపీఎం(చిత్తూరు) వాసు తెలిపారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం, కషాయాలు వినియోగంతో చీడపీడల నివారణతోపాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి సాగుతో పండించే చెరకు నుంచి తయారు చేసే బెల్లాన్ని తిరుమలతిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామని తెలిపారు. రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదు శాతం ఎక్కవ రేటుకు టీటీడీ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రకృతి సాగులో ఉన్న చెరకు పంటను పరిశీలించారు.

క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాసంతి

నగరి: పట్టణంలో క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేకేసీ హోమియోపతి కళాశాల విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సీఐ శ్రీనివాసంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహన, సరైన చికిత్స తీసుకుంటే వ్యాధిని సులభంగా నయం చేసుకోవచ్చని తెలిపారు. కళాశాల వైస్‌చైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణన్, ప్రొఫెసర్ కె. నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయులు వెంకటరమణరెడ్డి తెలిపారు. ఇటీవల వి.కోటలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక పోటీల్లో మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పి.గీతిక, జి.వంశీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. విద్యార్థులను శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

వడమాలపేట: అంబేడ్కర్ యువజన సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం వడమాలపేటలో సంఘం జిల్లా కార్యదర్శి మునిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా లోకనాథం, అధ్యక్షుడిగా జయంత్, జనరల్ సెక్రటరీగా దేవరాజులు, కోశాధికారిగా గణేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు డేవిడ్, వెంకటేష్, నాగరాజు, మస్తాన్, బాల, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ

నగరి: పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు పుత్తూరు మున్సిపాలిటీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా పాల్గొంటారు. మున్సిపల్ పాలకవర్గం, రాష్ట్ర బోర్డు డైరెక్టర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సచివాలయ వలంటీర్లు హాజరుకావాలని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

బ్రహ్మోత్సవాలను సమష్టిగా విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 13 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివ రాత్రి విజయవంతానికి అందరూ సహకరించాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. ఆలయ పరిపాలన భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల విజయవంతంలో మీడియాదే కీలకపాత్ర అని, ఈ ఏడాది నిర్వహించే ఉత్సవాలను సైతం అదే తరహాలో విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో పాలకమండలి, ఆలయ అధికారులు సమన్వయంతో ఉత్సవాల నిర్వహణకు అని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి, లింగోద్భవం రోజున సామాన్య భక్తులకు సైతం సులభంగా దర్శనం కలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రదోష పూజలు



నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు



శివపార్వతుల ప్రాకారోత్సవం

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకుని నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో శుక్రవారం సాయంత్రం నందీశ్వరునికి ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వరస్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పంచామృతం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అంతకు ముందు ఆలయంలో మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి, మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తి, రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో..



వెదురుకుప్పం: ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న వెలసి ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. సాయంత్రం ప్రదోషకాలంలో శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామునే ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పట్టుపీతాంబరాలు, వెండి తొడుగులతో కూడిన ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రదోష పూజలనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.